# శనేశ్వరం

నేనూ, వీరభద్రం రాస్‌బీహర్ ఎవిన్యూలో, ఆ హోటల్లో, మెత్తని సోఫాల్లో కూర్చుని బెంగాలీ స్పెషల్ రసగుల్లాలు తింటున్నాము.

ఘాటర్ బాక్స్ అనే నిక్‌నేమ్ వున్న వీరభద్రం రసగుల్లాలు తింటూనే చకచకా మాట్లాడేస్తున్నాడు.

“కల్‌కటా రావడం నేనిది రెండోసారి. పోయినసారి రాంచీలో ఇంటర్వ్యూకని వచ్చి నేనూ, రామకృష్ణ వచ్చాం. ఇప్పుడు ఈ యింటర్వ్యూ పేరుతో మళ్ళీ రావాల్సి వచ్చింది. బట్ స్టిల్ ఐ లైక్ కల్‌కటా ఎందుకో నీకు తెలుసా?” వీరభద్రం అడిగాడు.

నాకు తెలుసు - నేను అడిగినా అడగకపోయినా భద్రం చెప్పదలచుకున్నదేదో పూర్తిగా చెప్పందే వదలడని. అందుకే మౌనంగా రసగుల్లాల మాధుర్యం అనుభవిస్తూ ఊరుకున్నారు.

“నువ్వు ఎందుకు అని నన్ను అడగవ్ ? నాకు తెలుసు. అయినా చెబుతున్నా విను, ఐ లైక్ టూ థింగ్స్ యిన్ కల్‌కటా. డూ యూ నో వాట్ అర్ దోస్ టూ థింగ్స్? నీకు తెలీదని

కూడా నాకు తెలుసు. నేనే చెబుతున్నా విను - ఒన్ రసగుల్లాలు అండ్ టూ రసగుల్లాల్లాంటి బెంగాలీ అమ్మాయిలు. అందుకే ఐ లైక్ కల్‌కటా. మై కల్‌కటాసే ప్యార్ కర్‌తాహూ - సమ్‌ఝే? క్యా సమ్‌ఝే?''

అప్పుడే బయటకు వెళుతున్న బెంగాళీబాబు, పక్కనే వున్న చేపకళ్ళ బెంగాలీ సుందరి ఆ మాటలు విని, వీరభద్రాన్ని చూసి చిరునవ్వు వెళ్ళిపోయింది.

"సీ దెమ్ నా డైలాగు వాళ్ళకీ నచ్చింది. ఆ అమ్మాయి చూడు ఎంత అందంగా నవ్విందో! తెలుగమ్మాయిల కెవరికైనా అలా నవ్వడం తెలుసా అని అడుగుతున్నాను. మనవాళ్ళు ఎంతైనా మబ్బులు గురూ.''

ప్లేట్‌లో రసగుల్లాలు అయిపోవటంతో సింగడాల ప్లేటు ముందుకు లాక్కున్నాను. వీరభద్రంగాడి వేపు చూడకుండా తింటున్నాను.

"ఫర్ ఎగ్జాంపుల్, అదుగో ఆ ఎదురుగా కూర్చున్న అమ్మాయిని చూడు - ఎంత అందంగా వుందో! ఆ గులాబీ రంగు, తేనెరంగు కలయిక ఒక్క బెంగాలీల్లోనే వుంటుంది. పెదాలు చూడు ఎలా మెరుస్తున్నాయో. నవ్వితే సున్నాలా వుండే ఆ నోరు చూడు.. అటు చూడు.... సున్నాలా... అబ్బ నాకు భలే యిష్టం అలా వుంటే.''

చుట్టూ చూశాను భయంతో తెలుగు తెలిసిన వాళ్ళు ఎవరయినా వుంటే ఏమనుకుంటారో అన్న అదుర్దాతో. కానీ పైజమా లాల్చీల్లోని బెంగాలీబాబులు,సర్దార్‌జీలు తప్ప మనవాళ్ళు కనబడకపోయే సరికి 'అమ్మయ్య' అనుకున్నాను.

"ఆ బుగ్గలు ఎత్తుగా .... నీకు తెలుసా? ఆ అమ్మాయి బుగ్గల్లో రసగుల్లాలు వున్నాయి. అయినా చవటగాడివి, నీకేం తెలుస్తాయి ఇలాంటి విషయాలు. కళ్ళు మూసుకుని డజను రసగుల్లాలు తినమంటే తింటావు. ఆ అమ్మాయి కళ్ళు చూడు చేపల్లా. వీళ్ళ శరీరం అంత నిగనిగలాడుతూ వుండటానికి కారణం ఏమిటో తెలుసా? నీకేం తెలుసు గోంగూర పచ్చడిగాడివి. చేపల్లా. చేపలు ఫిష్ - ఆ అమ్మాయి బుగ్గల్లోని నునుపు మన తెలుగు అమ్మాయిల్లో ఏ కోశానా కనబడదు, ప్చ్!''

వేడివేడి టీని ఆస్వాదిస్తూ మాట్లాడకుండా వూరుకున్నాను.

"ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వితే ఎలా వుంటుందో తెలుసా? అయినా నీకెలా తెలుస్తుంది బడుద్దాయిగాడివి. నీ జన్మలో ఎప్పుడైనా ఐస్‌క్రీం తిన్నావా....?'' ఆ అమ్మాయి పక్కనే వున్న ముసలాయన లేచి నుంచోవటం చూసి ఆగాడు వీరభద్రం.

"రా అమ్మా సుబ్బలక్ష్మీ పోదాం. ఇలాంటి పోకిరీ వెధవలు ప్రతిచోటా వుంటూనే వుంటారు. రామేశ్వరం పోయినా శనేశ్వరం తప్పదని వూరికనే అన్నారా మనవాళ్ళు'' ఆయన స్వచ్ఛమైన తెలుగులో అన్నాడు.

సదరు సుబ్బలక్ష్మి చిటపటలాడుతూ లేచి ముసలాయన వెంబడి బయటకు నడిచింది.

రసగుల్లా మెత్తగానే వున్నా వీరభద్రం గొంతుకి అడ్డం పడ్డట్టుంది. *